క్లుప్తంగా

ప్రయాణికుల భద్రతే ముఖ్యం



గ్యారేజ్‌ను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్

డోన్ టౌన్: మరమ్మతులకు గురైన బస్సులను పూర్తి కండీషన్‌లో రిపేరు చేసి ఇవ్వాలని, ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్టీసీ కర్నూలు చీఫ్ మెకానికల్ ఇంజినీర్ హరి నాథబాబు అన్నారు. బుధవారం డోన్ డిపోను ఆయన పరిశీలించారు. డిపోలోని ఎలక్ట్రికల్, టైర్లు, స్టోర్స్‌లో విడిభాగాలు, ఇంధన విభాగాలను తనిఖీ చేశారు. డిపో సూపర్‌వైజర్స్, మెకానిక్‌లకు పలు సూచనలు చేశారు. బస్సులు దారి మధ్యలో ఫెయిల్ అవ్వకుండా చూడాలని.. అప్పుడే ప్రజలు ఆర్టీసీని ఆదరిస్తారని పేర్కొన్నారు. ఆయన వెంట డిపో మేనేజర్ శశిభూషణ్, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

సబ్సిడీ బియ్యం పట్టివేత

రాప్తాడు: పేదలకు సబ్సిడీపై అందిస్తున్న బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్‌డీటీ జ్యోతి తెలిపారు. బుధవారం వివరాలను వెల్లడించారు. కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన దిలీప్ తాను సేకరించిన 261 క్వింటాళ్ల బియ్యాన్ని మౌలాల అనే వ్యక్తికి చెందిన లారీలో కర్ణాటకలోని కోలారు జిల్లా బంగారుపేటకు తరలిస్తుండగా రాప్తాడు మండలం మరూరు టోల్‌ప్లాజా వద్ద అధికారులు పట్టుకున్నారు. ఎలాంటి బిల్లులు, ఆధారాలు లేకపోవడంతో లారీని సీజ్ చేశారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని గుంతకల్లులోని స్టాక్ పాయింట్‌కు తరలించారు.

ఉమామహేశ్వరుని సేవలో కాటసాని



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు

బనగానపల్లె: మండలంలోని యాగంటిలో వెలసిన ఉమామహేశ్వరస్వామి ఆలయాన్ని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని ఉమామహేశ్వరమ్మ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. శివపార్వతులకు అభిషేకాలు చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఈ నెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా వెలిగించే కార్తీక దీపం ఏర్పాట్లను కాటసాని రాంభూపాల్‌రెడ్డి పరిశీలించారు.

వైభవంగా మద్దిలేటిస్వామి కల్యాణోత్సవం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటి నరసింహస్వామిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్తమ హెచ్‌ఎంకు సత్కారం



సురేష్‌బాబును సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

డోన్ టౌన్: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న పట్టణంలోని నెహ్రూనగర్ హైస్కూల్ హెచ్‌ఎం తొగట సురేష్‌బాబును బుధవారం ఘనంగా సత్కరించారు. ఈయన ఈ నెల 11వ తేదీ విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. డోన్ పట్టణంలోని ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యాలయంలో వివేకానంద సేవా సమితి, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్తంగా సురేష్‌బాబును సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి వ్యవస్థాపకుడు మలిశెట్టి జగన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు సప్తశైల తిమ్మయ్య, అధ్యక్షకార్యదర్శులు నాగభూషణంరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోట్ల అండతోనే రేషన్ బియ్యం దందా

డోన్ టౌన్: ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి అండదండలతో ఆయన అనుచరులు పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్,కొయిలకొండ నాగరాజు ఆరోపించారు. బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. పారదర్శక పాలన అందిస్తారన్న నమ్మకంతో డోన్ నియోజకవర్గ ప్రజలు కోట్లను గెలిపిస్తే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారని దుయ్యబట్టారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాల్సిన రెవెన్యూ, పోలీస్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. నాయకులు శివరామ్, కొండన్న తదితరులు ఉన్నారు.

బాలలు..ప్రతిభా వెలుగులు

- ఆటల్లో సత్తా చాటుతున్న చిన్నారులు
- రాష్ట్ర,జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ
- నేడు బాలల దినోత్సవం



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోవెలకుంట్ల: బాల్యం.. భగవంతుడు ఇచ్చిన ఓ అమూల్యమైన వరం. అభం..శుభం తెలియని ఆ పసి మనుసులు పూతోటలో అప్పుడే పరిమళించిన పువ్వులు. పిల్లలపై అమితమైన అభిమానం చాటే దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఏటా నవంబర్ 14వ తేదీ బాలల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. పిల్లలపై ప్రేమ, సంరక్షణ, నాణ్యమైన విద్యపై చాచా నెహ్రూ నొక్కి చెప్పారు. రేపటి భవిష్యత్ అంతా బాలలదేనని మేధావి వర్గం బలంగా సంకల్పిస్తోంది. పిల్లల అభిరుచులకు అనుగుణంగా ప్రోత్సహిస్తూ వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి బాలల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తే వారి జీవితం ఉజ్వలంగా ఉంటుంది. నేటి ఆధునిక సమాజంలో ఎంతో మంది విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, వివిధ కళారంగాల్లో రాణిస్తూ పతకాలు సాధించడటంతోపాటు అందరి ఆదరాభిమానాలు చూరగొంటూ శభాష్ అనిపించుకుంటున్నారు. నియోజకవర్గంలోని బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లో 261 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మోడల్‌స్కూల్స్, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో గురువారం బాలదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు, బాల్యంలో అనేక కష్టాలు, ఒడిదుడుకులను ఎదుర్కొని వాటన్నింటిని అధిగమించి రాణిస్తున్న వారిపై ప్రత్యేక కథనం.

ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో..



కృష్ణగిరి మండలం మన్నెకుంట గ్రామానికి మల్లికార్జున, అనిత దంపతుల కుమార్తె విశాలాక్షి మల్టీ టాలెంటెడ్. కృష్ణగిరి కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి చదువుతోంది. పలు విభాగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తోంది. అర్చరీ, ఉడ్‌బాల్, రోప్ స్కిప్పింగ్, హైజంప్ పోటీల్లో రాణిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించింది. 2022లో వైఎస్సార్ కడప జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఉడ్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే 2022, 2023లో పార్వతీపురం మన్యం జిల్లాలో జరిగిన అర్చరీ, 2023లో గుంటూరులో జరిగిన హైజంప్ పోటీలు, 2023లో కర్నూలులో జరిగిన రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ద్వితీయ స్థానంలో రాణించి అందరి మన్ననలు పొందింది. చదువుతోపాటు క్రీడల్లో రాణించి భవిష్యత్తులో ఐఏఎస్ చదివి పేదలకు సేవా చేయాలనేదే తన లక్ష్యమని పేర్కొంది.

అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనడమే లక్ష్యం



చదువు, క్రీడలు రెండు కళ్లలా చేసుకుంటూ జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటుతోంది కృష్ణగిరి మండలం బాపనదొడ్డి గ్రామానికి చెందిన చెన్నయ్య, సుభద్ర దంపతుల కుమార్తె ఎం.గాయత్రి. వీరిది వ్యవసాయ కుటుంబం. గాయత్రీ కృష్ణగిరి కస్తూర్బా విద్యాలయంలో చదువుతోంది. చదువులో చురుగ్గా ఉంటూనే స్కిప్పింగ్, ఆటల్లో సత్తా చాటుతోంది. 2022లో కర్నూలులో జరిగిన స్కిప్పింగ్, అదే ఏడాది చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కిప్పింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. 2024లో తూర్పు గోదావరిలో జరిగిన స్కిప్పింగ్‌లో, అలాగే గుంటూరులో జరిగిన జాతీయ స్థాయి స్కిప్పింగ్‌లో ద్వితీయస్థానంలో రాణించింది. త్వరలో గోవాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది.

నెట్‌బాల్, రగ్బీలో రాణిస్తూ..



కృష్ణగిరి మండల పరిధిలోని బోయబొంతిరాళ్ల గ్రామానికి చెందిన భాస్కర్‌నాయుడు, మదన సౌందర్య దంపతుల కుమార్తె మానస స్థానిక కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్ చదువుతోంది. పలు క్రీడల్లో రాణిస్తూ శభాష్ అనిపించుకుంటోంది. ముఖ్యంగా నెట్‌బాల్, రగ్బీలో సత్తా చాటుతోంది. పీఈటీ సుప్రియతోపాటు ప్రిన్సిపాల్ చౌతన్య స్రవంతి ప్రత్యేక చొరవ చూపడంతో చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరుస్తోంది. రెండు పోటీల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రాణించింది.

తైక్వాండోలో రాణిస్తున్న కుందన్



కోవెలకుంట్ల పట్టణానికి చెందిన హరినాథ్, వాణి కుమారుడు కుందన్ స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. తండ్రి వాహనాల సీట్‌కవర్లు కుట్టడం, తల్లి హోంగార్డుగా పనిచేస్తోంది. కుందన్ చదువుతోపాటు తైక్వాండో, యంగ్‌మూదో పోటీల్లో రాణిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై వివిధ పతకాలు సాధించి సత్తా చాటాడు. 2020లో కర్నూలులో నిర్వహించిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకం కైవసం చేసున్నాడు. అదే ఏడాది ఆదోనిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో సైతం బంగారు పతకం దక్కింది. 2021లో తిరుపతి, గోవాలో జరిగిన రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించి బంగారు పతకాలు సొంతం చేసుకున్నాడు. 2022లో అనంతపురం, మహారాష్ట్రలో జరిగిన రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి యంగ్‌మూదో పోటీల్లో బంగారు పతకాలు, 2023లో తిరుపతిలో అంతరరాష్ట్రాల యంగ్‌మూదో పోటీల్లో బంగారు పతకాలు గెలుపొందాడు. డాక్టర్ వృత్తి చేపట్టి పేదలకు వైద్య సేవలందించాలన్నదే తమ కుమారుడి లక్ష్యమని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

పోస్టల్ సేవలు సులభతరం

- రూ.300తో ఖాతా ఓపెన్ చేసుకోవచ్చు
- పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు



పోస్టల్ సేవలపై అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్

కోవెలకుంట్ల: పోస్టల్ సేవలను మరింత సులభతరం చేసినట్లు పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వరప్రసాదరావు అధ్యక్షతన గ్రామ సచివాలయ సిబ్బందికి పోస్టాఫీసుల ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. రూ.300తో ఖాతా ప్రారంభిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లావాదేవీలు లబ్ధిదారుల ఖాతాలకే నేరుగా జమ అవుతాయని పేర్కొన్నారు. బ్యాంకులు అందుబాటులోలేని గ్రామాల్లో సైతం తపాలా సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వాలు అందించే పెన్షన్, ఉపాధిహామీ వేతనాలు, పీఎం కిసాన్, తదితర పథకాల ద్వారా పోస్టల్ ఖాతాల్లో నేరుగా జమ అవుతాయని పేర్కొన్నారు. ఖాతాకు అనుసంధానంగా ఫోన్‌పే, గూగుల్‌పే, తదితర యాప్‌లు వినియోగించుకోవచ్చని వివరించారు. ఆయా గ్రామాల ప్రజలు పోస్టల్ సేలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోస్టు మాస్టర్ ఓబులేసు, సిబ్బంది లోకేష్‌రెడ్డి, అబ్బాస్, నబీరసూల్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి



ఎస్‌ఐలతో సమీక్షిస్తున్న సీఐ

ప్యాపిలి: నేరాల నియంత్రణకు ఎస్‌ఐలు కృషి చేయాలని సీఐ వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఎస్‌ఐలతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాలపై పటిష్ట నిఘా ఉంచాలన్నారు. పేకాట, మట్కా తదితర జూదాలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఉంచాలని తెలిపారు. రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తూ వారిలో మార్పు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. వాహనాల తనిఖీలు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై, రికార్డులు సక్రమంగా లేని డ్రైవర్లు, వాహనాలపై కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో ప్యాపిలి, రాచర్ల, జలదుర్గం ఎస్‌ఐలు మధుసూదన్, లక్ష్మణ్ రావు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవాలను విజయవంతం చేయండి

బేతంచెర్ల: పట్టణంలోని గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆ శాఖ అధికారి మధుశేఖర్ కోరారు. ఈ నెల 14వ తేదీ బాలల దినోత్సవం, 15 పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న నాయకులను స్మరించుకోవడం, 17న విద్యార్థులకు చిత్ర లేఖనం, 18న వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, 19న ముగ్గుల పోటీలు, 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన తదితర కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

నేటి నుంచి గ్రథాలయ వారోత్సవాలు

సంజామల: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి తిమ్మారెడ్డి తెలిపారు. 14న ప్రారంభోత్సవ వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, 16న జాతీయ స్వాతంత్ర్య పోరాట యోధులపై ప్రసంగాల పోటీలు, 17న రాష్ట్రంలోని స్వాతంత్ర్య యోధులపై ప్రసంగాల పోటీలు, 18న గ్రంథాలయ ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు, 19న మహిళా సాధికారతపై చర్చ, 20న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

విద్యార్థులకు 'అపార్' కష్టాలు



ఆధార్‌లో తప్పులు సరి చేసుకుంటున్న విద్యార్థులు

కొలిమిగుండ్ల: జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థికి గుర్తింపు నంబర్ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్ వన్ స్టూడెంట్ నినాదంలో భాగంగా అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ)కు శ్రీకారం చుట్టింది. 12 అంకెలతో కూడిన అపార్ నంబర్‌ను విద్యార్థులకు కేటాయిస్తారు. చాలా మంది విద్యార్థులు అపార్ నమోదు చేసుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. బర్త్ సర్టిఫికెట్‌లో ఒక పేరు ఉంటే ఆధార్‌లో మరొక రకంగా ఉండడంతో అపార్ నమోదుకు అనుమతించడం లేదు. పేర్లలో చిన్న మార్పులు ఉన్నా అప్‌లోడ్ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆధార్ సెంటర్లకు వెళ్లి ఆధార్‌లో పేర్లను మార్పు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నాయి. విద్యార్థుల వివరాలను పాఠశాలల్లో అడ్మిషన్ సమయంలో రిజిస్టర్‌తో పాటు యుడైస్‌లో నమోదు చేశారు. అపార్ నమోదు సమయంలో ఆధార్ కార్డు వాడడంతో అందులోని పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు వంటి వివరాలు అడ్మిషన్ రిజిస్టర్, యూడైస్‌లతో పోలిస్తే వేర్వేరుగా ఉంటున్నాయి. దీంతో అపార్ నమోదులో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. సాంకేతిక సమస్యలు పరిష్కరించుకునేందుకు విద్యార్థులు, తల్లితండ్రులు ఆధార్ కేంద్రాలు, జెరాక్స్ సెంటర్లతో పాటు నోటరీల కోసం లాయర్ల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. చాలా మంది విద్యార్థులు నంద్యాల, కర్నూలు తదితర పట్టణాల్లోని హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారు. అపార్ నమోదులో సమస్యలు తలెత్తడంతో సొంత ఊర్లకు వచ్చి ఆధార్‌లో తప్పులను సరి చేసుకుని పోవాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన విధానం లేకపోవడంతో విద్యార్థుల తల్లితండ్రులు అవస్థలు పడుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె రూరల్: మండలంలోని తిమ్మాపురం 11కేవీ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ మండల రూరల్ ఏఈ గర్జప్ప తెలిపారు. తిమ్మాపురం, బీరవోలు, జిల్లెల్ల, రామతీర్థం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. కాగా వ్యవసాయానికి ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు.. మళ్లీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన



రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్‌నగర్- కందికాయపల్లె మార్గంలో నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను ఆర్డీఓ నరసింహులు బుధవారం పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నెలలోగా బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేస్తామని రైల్వే అధికారులు తెలిపారు. అనంతరం ఆర్డీఓ బేతంచెర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థి శశాంక్

డోన్ టౌన్: పట్టణంలోని శ్యాంజో స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న మల్లాపు శశాంక్ ఫెన్సింగ్ అండర్-14 జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు స్కూల్ నిర్వాహకులు తెలిపారు. ఇటీవల నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జమ్ముకాశ్మీర్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

బేతంచెర్ల: వాహనదారులు ప్రమాదాల నివారణకు రోడ్డు నిబంధనలు పాటించాలని డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని పలు కూడళ్లలో వాహనాల తనిఖీ నిర్వహించారు. విహన రికార్డులు, రోడ్డు టాక్స్, లైసెన్స్, బీమా లేని వారితో పాటు అధిక లోడ్డుతో వెళ్తున్న వాహన డ్రైవర్లకు రూ.4,28,700 జరిమానా విధించారు. 18 వాహనాలపై కేసు నమోదు చేశారు.

పంటల బీమాకు ప్రీమియం చెల్లించాలి

ప్యాపిలి: రబీలో వివిధ పంటలు సాగు చేస్తున్న రైతులు బీమా పొందేందుకు ప్రీమియం చెల్లించాలని వ్యవసాయాధికారి రాజేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ఎకరా వేరుశనగకు రూ.64, శనగలు రూ. 84, జొన్నకు రూ. 60, ఉల్లిపాయలకు రూ. 90, మినుములుకు రూ. 48, వరికి రూ. 126 చొప్పున డిసెంబర్ 15వ తేదీలోగా ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రీమియం చెల్లించని రైతులకు ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టం వాటిల్లితే బీమా వర్తించదని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

బనగానపల్లె రూరల్: కాలజ్ఞాన ప్రబోధకర్త, సంఘ సంస్కర్త మద్విరాట్ శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 416వ జయంతి వేడుకలను బుధవారం బనగానపల్లెలో ఘనంగా నిర్వహించారు. నంద్యాల రోడ్డులోని వీరప్పయ్యస్వామి నేలమఠంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసఆచారి ఆధ్వర్యంలో వేకువజామున సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. ఉదయం 10:30 గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణోత్సవం, సాయంత్రం పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

దిగుబడి పెంచేలా ముందస్తు ప్రణాళికలు



శనగ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

కోవెలకుంట్ల: వికసిత్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 2025 ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. బుధవారం కోవెలకుంట్ల మండలం గుంజలపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయా పంటల్లో దిగుడులు పెంచే విధంగా ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో దాదాపు 40 వేల హెక్టార్లలో రైతులు శనగ పంట వేస్తున్నారన్నారు. వచ్చే ఏడాది నుంచి ఈ పంటకు ముందు స్వల్పకాలిక రకాలైన కొర్ర, మినుము, పెసర, తదితర పంటలు సాగు చేయడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. రైతులే పంట బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండల వ్యవసాయాధికారి నిరంజన్, పశు వైద్యాధికారి కృష్ణకుమార్ పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి

సంజామల: రైతులు పంట మార్పిడి చేయడం వల్ల అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. గిద్దలూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రబీలో శనగ పంటకు ముందు కొర్రను సాగుచేస్తే మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి ఉన్నారు.